సాక్షి
నిజామాబాద్
బుధవారం । 17 । ఏప్రిల్ । 2024



'మిత్తి' మీరుతున్నారు

సామాన్యుల అవసరాలను ఆసరాగా చేసుకొని వ్యాపారులు అధిక వడ్డీకి అప్పులు ఇస్తున్నారు.

- IIలో ▸



ఉచితం.. పరిమితం

ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక తరలింపు కోసం ప్రభుత్వం జిల్లాలో పరిమిత పాయింట్లకే అనుమతి ఇచ్చింది.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
41.5 /26.7

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

అధికారమే అంతిమ లక్ష్యం

- మున్సిపాలిటీల్లో మారుతున్న కండువాలు..
- ఆర్మూర్, కామారెడ్డిల్లో నెగ్గిన అవిశ్వాసాలు.. కొత్త ఛైర్‌పర్సన్ల ఎన్నిక
- అసెంబ్లీ ఎన్నికలకు ముందే కాంగ్రెస్‌లో చేరిన బోధన్ మున్సిపల్ ఛైర్‌పర్సన్
- ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో దోబూచులాట
- బాన్సువాడ బల్దియా, నిజామాబాద్ కార్పొరేషన్‌లోనూ పార్టీలు మారుతున్న ప్రజాప్రతినిధులు

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు అధికారం కావాలి.. కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల వేళ క్షేత్ర స్థాయిలో కేడర్ అవసరం.. ఇంకేముంది జోరుగా కండువాలు మారుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ఆర్మూర్, కామారెడ్డి మున్సిపల్ పీఠాలు కాంగ్రెస్ వశమయ్యాయి. ఛైర్‌పర్సన్‌లుగా ఆ పార్టీ శ్రేణులు ఎన్నికయ్యారు. బాన్సువాడ మున్సిపాలిటీ, నిజామాబాద్ కార్పొరేషన్‌లోనూ పార్టీ ఫిరాయింపులు జరిగాయి.



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అధికారానికి అయస్కాంతం మాదిరిగా అతుక్కుపోయేందుకు మున్సిపాలిటీల ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు కండువాలు మార్చుకుంటున్నారు. మరోవైపు మున్సిపల్ పీఠాల కోసం భారీ స్థాయిలో క్యాంపు రాజకీయాలు చేస్తున్నారు. అంతా అమ్ముడుపోవడం, కొనుక్కోవడం అన్నవిధంగా పరిస్థితి తయారైంది. రాష్ట్రంలో నాలుగు నెలల క్రితం అధికారం మారడం, మరోవైపు పార్లమెంట్ ఎన్నికలు రావడంతో ఈ మధ్య కాలంలో ఎవరి అవసరాలు వారివి అన్నవిధంగా పావులు కదుపుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులకు అధికారం కావాలి.. అధికార కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్థానిక సంస్థల్లో పట్టు, కిందిస్థాయిలో కేడర్ అవసరం. దీంతో పరిణామాలు వేగంగా మారుతూ వస్తున్నాయి. నాలుగు నెలల కిత్రం వరకు బీఆర్‌ఎస్‌లో ఉన్న మున్సిపాలిటీల కౌన్సిలర్లు వెంటనే కండువాలు మార్చుకుని తిరిగి ఛైర్‌పర్సన్ పీఠాల కోసం పోటీలు పడుతున్నారు. దీంతో అవిశ్వాసాలు, క్యాంపులు, సరికొత్త ఎంపికలు వరుసగా జరుగుతున్నాయి.

■ బోధన్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తూము పద్మ, ఆమె భర్త, కౌన్సిలర్ శరత్‌రెడ్డి అప్పటి ఎమ్మెల్యే షకీల్‌తో విభేదించి ఎన్నికలకు ముందే కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో వారి కుర్చీకి ఢోకా లేకుండా పోయింది. ఈ క్రమంలో పలువురు కౌన్సిలర్లు విడతలవారీగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటూ వస్తున్నారు.

■ ఆర్మూర్‌లో మున్సిపల్ పీఠం విషయంలో పరిణామాలు అనేక మలుపులు తిరుగుతూ వచ్చాయి. మేమంతా కరడుగట్టిన తెలంగాణవాదులం, బీఆర్‌ఎస్ వీరాభిమానులమని చెప్పుకున్న కౌన్సిలర్లు విడతలవారీగా ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. మున్సిపల్ ఛైర్ పర్సన్‌గా ఉన్న పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం అంశం రసవత్తర రాజకీయానికి కేరాఫ్‌గా నిలిచింది. వినీత వర్గానికి చెందిన 10 మంది కౌన్సిలర్లు తమ అధికారాన్ని కాపాడుకోవడానికి కాంగ్రెస్ నాయకులను ఆశ్రయించారు. అయితే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన వ్యతిరేక వర్గానికి చెందిన 15 మంది కౌన్సిలర్లు పోటీపడి వినీత వర్గానికంటే ముందే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పెద్దల సహకారంతో వినీతను దించేసి వన్నెల్‌దేవి లావణ్యను ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. అనంతరం చేసేదేమీ లేక వినీత వర్గీయులు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మొత్తం 36 మంది కౌన్సిలర్లలో బీజేపీకి చెందిన ఐదుగురు, ఎంఐఎంకు చెందిన ఒక కౌన్సిలర్ మినహా అందరూ బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పక్షాన చేరారు. ఈ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పాలన వచ్చింది.

■ బాన్సువాడ మున్సిపాలిటీకి చెందిన 6 గురు కౌన్సిలర్లు తాజాగా కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఇక్కడ ప్రస్తుతం స్తబ్దుగా ఉంది. మొత్తం 19 మంది కౌన్సిలర్లు ఉన్నారు.

■ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ విషయానికి వస్తే బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు కార్పొరేటర్లు విడతలవారీగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. మరోవైపు బీజేపీ నుంచి గెలిచి గతంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కొందరు కార్పొరేటర్లు తాజాగా విడతలవారీగా తిరిగి బీజేపీలోకే వస్తుండడం గమనార్హం.

■ కామారెడ్డి మున్సిపాలిటీలోనూ ఛైర్‌పర్సన్‌గా ఉన్న నిట్టు జాహ్నవిపై అవిశ్వాసం పెట్టి దించేశారు. ఈమె స్థానంలో గడ్డం ఇందుప్రియను ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. గత నెల 30న జాహ్నవిపై అవిశ్వాసం పెట్టగా బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల మద్దతుతో అవిశ్వాసం నెగ్గింది. ఇందుప్రియ భర్త గడ్డం చంద్రశేఖర్‌రెడ్డిని అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేయడంతో కాంగ్రెస్‌లోకి వెళ్లారు. తాజాగా క్యాంపు నిర్వహించిన చంద్రశేఖర్‌రెడ్డి తన భార్య ఇందుప్రియ ఛైర్‌పర్సన్ అయ్యేందుకు కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుకుని సీల్డ్ కవర్ తెప్పించుకోవడం గమనార్హం.

■ మొత్తం 12 మంది కౌన్సిలర్లు ఉన్న ఎల్లారెడ్డి మున్సిపల్‌లో ఛైర్మన్ కుడుముల సత్యనారాయణకు మరో నలుగురు కౌన్సిలర్ల మద్దతు ఉంది. బీఆర్‌ఎస్‌లో ఉన్న సత్యనారాయణ కాంగ్రెస్, బీజేపీల్లో ఏ పార్టీలో చేరాలనే మీమాంసలో ఉన్నారు. ఈయన కు ఎంపీ బీబీపాటిల్ టచ్‌లో ఉండడంతో ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. బీఆర్‌ఎస్‌లోనే ఉన్న పద్మ శ్రీకాంత్ సైతం మరో ఆరుగురు కౌన్సిలర్ల మద్దతుతో ఉన్నారు. శ్రీకాంత్‌కు మద్దతు ఇస్తున్నవారిలో ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌కు చెందినవారు. ఇటీవల అవిశ్వాసం పెట్టేందుకు శ్రీకాంత్ గోవాలో క్యాంప్ నిర్వహించినప్పటికీ ఇందుకు 8 మంది కౌన్సిలర్లు అవసరముండడంతో అది సాధ్యపడలేదు. ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో ఏం జరుగుతుందో చూడాల్సి ఉంది.

లక్ష్యాన్ని మించి రుణాలు



స్త్రీనిధి టార్గెట్ పూర్తి చేసినందుకు కేక్ కట్ చేస్తున్న డీఆర్‌డీవో సాయాగౌడ్

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలోని మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలను లక్ష్యానికి మించి అందజేశారు. రూ.1032.74కోట్ల బ్యాంకు లింకేజీ టార్గెట్‌ను ఐకేపీ అధికారులు సునాయాసంగా సాధించారు. దీంతో జిల్లా రాష్ట్రంలో 8వ స్థానంలో నిలిచింది. లక్ష్యానికి మించి రుణాలు అందజేసినందుకు ఇటీవల గ్రామీణాభివృద్ధి శాఖలో ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి బ్యాంకు లింకేజీలో రూ.1130.49కోట్ల (109.47శాతం)రుణాలను 19,053 మహిళా సంఘాలకు పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 22 మండలాల్లో నూరు శాతానికి మించి రుణాలు అందజేయగా, ధర్పల్లి, భీమ్‌గల్ మండలాలు కాస్త వెనుకబడ్డాయి. టార్గెట్‌ను చేరుకోవడానికి కొన్ని మండలాల్లో మహిళా సంఘాలు వద్దన్నా అధికారులే రుణాలు అంటగట్టారనే విమర్శలు ఉన్నాయి. అదే విధంగా స్త్రీనిధిలో జిల్లాకు రూ.185.24కోట్ల లక్ష్యానికి రూ.186.18 కోట్ల (100.51శాతం) రుణాలను 7,560 మహిళా సంఘాలలోని 23,905 మంది సభ్యులకు అందజేశారు. లక్ష్యానికి మించి రుణాలు అందజేసినందుకు ఐకేపీ, స్త్రీనిధి ఉద్యోగులను డీఆర్‌డీవో అభినందించారు.

అందరి సహకారంతో..

ఎస్‌హెచ్‌జీ మహిళలు ఆర్థి కంగా నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి పథకాల ద్వారా రుణా లు అందజేస్తోంది. జిల్లాకు నిర్దేశించిన దాంట్లో లక్ష్యానికి మించి మహిళా సంఘాలకు రుణాలు అందించాం. ఐకేపీ, స్త్రీనిధి ఉద్యోగులు, సిబ్బంది సహకారంతోనే టార్గెట్‌ను అధిగమించాం.
– సాయాగౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

న్యూస్‌రీల్

ఆశవర్కర్లు రోగులను రిఫర్ చేస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: ఆశవర్కర్లు రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో సుదర్శనం హెచ్చరించారు. 'కమీషన్ల ఆశ చూపుతూ..' శీర్షికన సాక్షి పత్రికలో ఈ నెల 16న ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఇప్పటికే సమీక్షలు, నెలవారీ ఆశ డే సమావేశాల్లో పీహెచ్‌సీల వారీగా ఆశ కార్యకర్తలకు నియమ నిబంధనలు తెలియజేశామన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, డబ్బులకు ఆశపడి రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్య సిబ్బందిని, ఆశవర్కర్లను మభ్యపెడుతున్నట్లు తమ దృష్టికి రాలేదన్నారు. పలువురు పీఎంపీ, ఆర్‌ఎంపీలు నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలడంతో జనవరిలో పలు క్లినిక్‌లు సీజ్ చేశామన్నారు. వైద్యారోగ్యశాఖ ఉద్యోగులు రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్



ఖలీల్‌వాడి: జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో మంగళవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాజేశ్వర్ కాంగ్రెస్ పార్టీలో కౌన్సిలర్‌గా రాజకీయ జీవితం మొదలు పెట్టారు. తర్వాత జుక్కల్ టికెట్ కోసం ప్రయత్నించిన దక్కలేదు. వైఎస్‌ఆర్ హయాంలో రాజేశ్వర్ ఎమ్మెల్సీగా నియామకం అయ్యారు. తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరి మళ్లీ ఎమ్మెల్సీగా ఎంపికయ్యారు. ప్రస్తుతం మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ.. సొంత గూటికి రావడం సంతోషంగా ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

20 నుంచి క్రికెట్‌లో ఉచిత శిక్షణ



నిజామాబాద్ నాగారం: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి ఉచిత క్రికెట్ శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు బాలబాలికలకు శిక్షణ ఉంటుందని తెలిపారు. నగరంలోని నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానం(9849073809), కామారెడ్డిలోని ఇందిరాగాంధీ స్టేడియం(9666677786), ఆర్మూర్‌లో మామిడిపల్లి ఎక్స్‌రోడ్‌లోని మోడల్ స్కూల్‌లో (9640573063) శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు పై నంబర్లను సంప్రదించాలని సూచించారు. కోచ్ ఫారస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌తో జిల్లాలో కలకలం

- మృతుల్లో ఉమ్మడి జిల్లా వాసులున్నారని ప్రచారం

సాక్షి, కామారెడ్డి: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లాలో మంగళవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కలకలం సృష్టించింది. ఈ ఎన్‌కౌంటర్‌లో 29 మంది మృత్యువాతపడగా.. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన అజ్ఞాత మావోయిస్టులు ఉన్నారన్న ప్రచారం జరగడంతో అంతా ఉలిక్కిపడ్డారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పది మందికిపైగా మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నట్టు తెలుస్తోంది. కామారెడ్డి జిల్లా ఇస్రోజీవాడికి చెందిన లోకోటి చందర్ అలియాస్ స్వామితో పాటు ఆయన కుమారుడు రమేశ్, కూతురు లావణ్య, పాల్వంచ మండలం ఆరేపల్లికి చెందిన ఎర్రగొల్ల రవి, సదాశివనగర్ మండలానికి చెందిన మరొకరు అజ్ఞాతంలో కొనసాగుతున్నారు. అలాగే నిజామాబాద్ జిల్లాకు చెందిన వారు కూడా పలువురు అజ్ఞాతంలో ఉన్నారు. ఎన్‌కౌంటర్‌లో జిల్లావాసులు ఉన్నారని ప్రచారం జరగడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌వి బూటకపు హామీలు

- ఐదేళ్లు రేవంత్‌రెడ్డి సీఎంగా ఉండటం డౌటే!
- ఎంపీ అర్వింద్ ధర్మపురి

సుభాష్‌నగర్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఓట్ల కోసం బూటకపు హామీలు ఇస్తున్నాయని, పదేళ్ల బీఆర్‌ఎస్, నాలుగు నెలల కాంగ్రెస్ పాలనను దృష్టిలో ఉంచుకుని ఓటేయాలని బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ ధర్మపురి సూచించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు గ్యారంటీయే లేదని, బీజేపీ సంకల్ప పత్రానికి (ఎన్నికల మేనిఫెస్టో) ప్రధాని మోదీ గ్యారంటీ అన్నారు. మంగళవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సుమారు 30 లక్షల మంది సలహాల మేరకే బీజేపీ సంకల్ప పత్రాన్ని విడుదల చేసిందని తెలిపారు. అవినీతికి పాల్పడితే ఎంతటి వారైనా జైలు పాలు కాక తప్పదన్నారు. ఎమ్మెల్సీ కవితను సీబీఐ, ఈడీ అరెస్ట్ చేశాయని ఇప్పట్లో బెయిల్ రావడం కష్టమేనని పేర్కొన్నారు. మహిళల హక్కులు, ఆత్మాభిమానం కోసం యూనిఫాం సివిల్ కోడ్ అమలు చేసి తీరుతామని, సీఏఏ, ఎన్‌ఆర్‌సీ అమలవుతుందని పేర్కొన్నారు. దేశానికి ఈ ఎన్నికలు ముఖ్యమైనవని, ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటేసి గెలిపించాలని కోరారు.

టూరిజం కారిడార్‌గా తీర్చిదిద్దుతాం

కందకుర్తి వద్దగల త్రివేణి సంగమం, బాసర సరస్వతి అమ్మవారి క్షేత్రం, ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌ను కలుపుకుని టూరిజం కారిడార్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఉన్నామని ఎంపీ అర్వింద్ తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణాపై నిఘా, పేపర్ లీకేజీలపై కఠినచర్యలు ఉంటాయన్నారు. వన్ నేషన్ – వన్ ఎలక్షన్‌తో దేశానికి రూ.లక్షల కోట్లు మిగులుతాయని, అభివృద్ధికి ఎలాంటి ఆటంకం ఉండబోదన్నారు. ప్రభుత్వం జన్యూన్‌గా నిజాంషుగర్ ఫ్యాక్టరీని వాల్యుయేషన్ వేయిస్తే.. నెల రోజుల్లో తెరిపించే బాధ్యత తనదేనన్నారు.

కాంగ్రెస్ హిందూ వ్యతిరేకి

కాంగ్రెస్ హిందూ వ్యతిరేకి అని హిందువునని చెప్పుకునే సీఎం రేవంత్‌రెడ్డి సీఏఏ, ఎన్‌ఆర్‌సీ, యూనిఫాం సివిల్ కోడ్‌పై తన స్టాండ్ తెలియజేయాలని అర్వింద్ డిమాండ్ చేశారు. దేశ సంస్కృతీ సంప్రదాయాలను బ్రిటీష్ వారి కంటే ఎక్కువగా కాంగ్రెస్ ధ్వంసం చేసిందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానంటే కాంగ్రెస్‌లోని నాయకులు చేయనివ్వరని విమర్శించారు. కాంగ్రెస్‌లో ఉంటే రేవంత్‌రెడ్డి ఐదేళ్లు సీఎంగా ఉండటం అనుమానమే అన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, పాట్కూరి తిరుపతిరెడ్డి, న్యాలం రాజు, పంచరెడ్డి లింగం, పద్మారెడ్డి, నాగోళ్ల లక్ష్మీనారాయణ, ఖైజర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్ ధర్మపురి

రైతులకు సకాలంలో చెల్లింపులు

- రాష్ట్రవ్యాప్తంగా 2.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దేవేంద్ర సింగ్ చౌహాన్

సుభాష్‌నగర్: యాసంగి సీజన్‌కు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా రికార్డు స్థాయిలో ఇప్పటికే 2.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దేవేంద్ర సింగ్ చౌహాన్ తెలిపారు. ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం ఆయన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తదితరులతో కలిసి జిల్లాలోని రైస్ మిల్లులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. అనంతరం గుండారం గ్రామంలోని జై గణేష్ ప్యాడి ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్‌ను సందర్శించి, ధాన్యం మర పడుతున్న తీరు, స్టాక్ నిల్వలను పరిశీలించారు. అంతకుముందు కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో అధికారులు, రైస్‌మిల్లర్లతో సమావేశమయ్యారు. రైస్‌మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. గతంలో కంటే రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మిల్లింగ్ తదితర అంశాల్లో ఎంతో మార్పు వచ్చిందన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా ఆశించిన రీతిలో సహాయ, సహకారాలు లభిస్తున్నాయని తెలిపారు. సీఎంఆర్ కేటాయింపులు లక్ష్యానికి అనుగుణంగా సకాలంలో జరిగేలా ధాన్యం మిల్లింగ్ చేయాలని మిల్లర్లకు సూచించారు. ముఖ్యంగా పారాబాయిల్డ్ బియ్యం నిల్వల అవసరం ఎక్కువగా ఉన్నందున ఏమాత్రం విరామం లేకుండా మిల్లింగ్ జరిపించాలన్నారు. కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు మన బియ్యం ఎగుమతి చేస్తున్నందున నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ దేవేంద్ర సింగ్ చౌహాన్, పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

రికార్డు స్థాయిలో ధాన్యం సేకరణ

రాష్ట్రంలో ఇప్పటికే రికార్డు స్థాయిలో 2.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, గతేడాది ఈ సమయానికి 233 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించామని దేవేంద్రసింగ్ చౌహాన్ వెల్లడించారు. ఈసారి కేంద్రాలను ముందస్తుగానే ప్రారంభించామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా తనిఖీ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఉంచాలని ఆదేశించారు. కాగా జిల్లాలో 373 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, ఇప్పటికే లక్షా 35వేల మెట్రిక్ టన్నుల ధా న్యం సేకరించామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హను మంతు డీఎస్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు రూ.98కోట్ల ధాన్యం డబ్బులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. ట్రెయినీ కలెక్టర్ కిరణ్మయి, డీఎస్‌వో చంద్రప్రకాష్, సివిల్ సప్లైస్ డీఎం జగదీశ్, అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు. కాగా అంతకుముందు జిల్లాకు చేరుకున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ డీఎస్ చౌహాన్‌కు ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద కలెక్టర్, సీపీ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.


ఇబ్బందులు ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయాలి



ఇందల్వాయి: రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి దేవేంద్ర సింగ్ చౌహాన్ ఆదేశించారు. ఇందల్వాయి మండలంలోని గన్నారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్, అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడారు. సకాలంలో రైతులకు డబ్బులు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కేంద్రాలకు తీసుకు రావాలన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే పై అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. గన్ని బస్తాలు, లారీలు అందుబాటులో ఉంచి సకాలంలో ధాన్యం రైస్‌మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. డీఎస్‌వో చంద్ర ప్రకాశ్, సివిల్ సప్‌లై డీఎం జగదీశ్, సీఈవో రతన్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాల టీచర్‌పై చర్యలేవి?

- నాలుగు చోట్ల ప్రభుత్వ భూములు కబ్జా



నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వం ఇచ్చే జీతం తీసుకుంటూ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాలిన ఉపాధ్యాయుడు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నాడు. కొందరు సంఘం నాయకులను కలుపుకొని ఓ ప్రజాప్రతినిధితో కలిసి గతకొన్నేళ్లుగా జిల్లా కేంద్రంతోపాటు ఇతర ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తున్నాడు. నందిపేట మండలంలో విధులు నిర్వర్తిస్తున్న ఆ ఉపాధ్యాయుడిపై ఇటీవల కొందరు డీఈవో, పాఠశాల విద్యాశాఖ (హైదరాబాద్)కు ఫిర్యాదు చేశారు.

నగరంలోని వినాయక్‌నగర్ యాదగిరిబాగ్‌లో ప్రభుత్వ స్థలాన్ని ఓ ముఖ్య ప్రజాప్రతినిధితో కలిసి కబ్జా చేశాడు. ఇక్కడ కొందరు నిరుపేదలు గుడిసెలు వేసుకొని ఉండగా, వారిని బెదిరించి ఖాళీ చేయించాడు. గుడిసెలు వేసుకున్న వారు ఉపాధ్యాయుడితో వాగ్వాదానికి దిగగా, వారిపై దాడి చేసేందుకు ప్రయత్నించాడు. దీంతోవారు అతడిపై నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. వినాయకనగర్‌లోని మరోచోట పూలాంగ్ వాగు పక్కన స్థలాన్ని కబ్జా చేసి ఇతరుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించారు. పాఠశాల రిజిస్టర్‌లో సంతకం చేసి ప్రతిరోజూ వ్యక్తిగత పనిమీద బయటికి వెళ్తున్నాడని తెలిసింది. యాదగిరిబాగ్‌లో పేదలకు వాగ్వాదానికి దిగిన రోజున సదరు ఉపాధ్యాయుడు సాధారణ సెలవు పెట్టి మరీ వచ్చారు. దీంతో సదరు ఉపాధ్యాయుడి లీవ్‌లెటర్‌తోపాటు యాదగిరి బాగ్‌లోని కబ్జాస్థలంలో ఉన్న ఫొటోలను, ఎఫ్‌ఐఆర్‌కాపీని జతచేసి విద్యాశాఖకు ఫిర్యాదు చేశారు. ఇదే ఉపాధ్యాయుడు నవీపేట మండలంలో రెండు చోట్ల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి ఇతరుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించినట్లు ఆరోపణలున్నాయి. నాగారంలో కొన్ని చోట్ల పట్టాలిప్పిస్తామని పలువురు మహిళల వద్ద నుంచి డబ్బులు వసూలు చేసి మోసగించినట్లు ఫిర్యాదులున్నాయి. గతంలో ఆయనపై అందిన ఫిర్యాదులపై విచారణ చేపట్టిన ఎంఈవో అసంపూర్తి నివేదిక ఇవ్వగా, మళ్లీ విచారణ చేపట్టాలని మరో అధికారిని డీఈవో నియమించారు.

కేసులు.. ఫిర్యాదులు


ఇన్ని ఫిర్యాదులున్నా ఉపాధ్యాయుడిపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరి 5న కలెక్టర్‌కు బోర్గం(పి) గ్రామానికి చెందిన రవి ఫిర్యాదు చేశారు. నాలుగో పోలీస్ స్టేషన్ పరిధిలో మార్చి 16న కేసు నమోదైంది. సీపీతోపాటు డీఈవో, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారికి కూడా బాధితులు ఫిర్యాదు చేశారు. విద్యాశాఖ కార్యాలయంలో పని చేస్తున్న ఓ ఉద్యోగి అండతో సదరు టీచర్ తప్పించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

చర్యలు తీసుకుంటాం

కబ్జాల వ్యవహారంలో టీచర్‌పై ఫిర్యాదులు అందాయి. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. ఇది వరకే విచారణ ప్రారంభమైంది. – దుర్గాప్రసాద్, డీఈవో

రాములోరి పెళ్లికి వేళాయే..

శ్రీరామ నవమి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. జిల్లా వ్యాప్తంగా సీతారాముల కల్యాణాన్ని ఘనంగా జరిపించనున్నారు. రాములోరి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.



విద్యుత్ దీపాల్లో వెలిగిపోతున్న డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం

క్లుప్తంగా

డీఐఈవో అభినందన



నిజామాబాద్‌అర్బన్: విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా డిజిటల్ విద్యాబోధన చేస్తున్న ఆదర్శ పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు డాక్టర్ శ్రీనివాస్‌రాజుని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి రవికుమార్ సోమవారం అభినందించారు. ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరానికి సంబంధించిన ఆంగ్ల సిలబస్‌ను టీ–శాట్ ద్వారా బోధించినందుకు తెలంగాణ ఇంటర్మీడియెట్ అధికారులు పంపిన ప్రశంసాపత్రాన్ని శ్రీనివాస్‌రాజుకి డీఐఈవో అందజేశారు. శ్రీనివాస్‌రాజు ప్రస్తుతం రుద్రూర్ ఆదర్శ పాఠశాల, కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు.

25వరకు డిగ్రీ ఫీజు చెల్లింపునకు గడువు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ రెగ్యులర్ పరీక్షల ఫీజును ఈనెల 25వ తేదీ వరకు చెల్లించవచ్చని పరీక్షల నియంత్రణాధికారిణి (కంట్రోలర్) ఎం.అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో 26వరకు, రూ.500 అపరాధ రుసుముతో 27వరకు, రూ.వేయి అపరాధ రుసుముతో ఈ నెల 29వరకు, రూ.2వేలు అపరాధ రుసుముతో ఈ నెల 30వ తేదీ వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.in ను సంప్రదించాలని ఆమె సూచించారు.

28న ప్రవేశపరీక్ష

నిజామాబాద్‌అర్బన్: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్‌లో ఆరో తరగతిలో ప్రవేశం కోసం ఈ నెల 28వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిట్ కార్డును ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, తమకు కేటాయించిన పరీక్షాకేంద్రానికి నిర్ణీత సమయంలో విద్యార్థులు చేసుకోవాలని సూచించారు. ప్రవేశపరీక్ష రాష్ట్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

‘మిత్తి’ మీరుతున్నారు

- వందకు రూ.5 వడ్డీ వసూలు చేస్తున్న వ్యాపారులు
- ముందస్తుగా భూముల రిజిస్ట్రేషన్లు
- రియల్ ఎస్టేట్ కేంద్రంగా కొనసాగుతున్న దందా

బాన్సువాడ : బాన్సువాడ పట్టణానికి చెందిన ఓ చిరు ఉద్యోగి తన కుతురికి పెళ్లి చేయాలని మంచి సంబంధం చూశాడు. చేతిలో చిల్లి గవ్వ లేకపోయినా.. మళ్లీ ఇంత మంచి సంబంధం వస్తుందో రాదోనని పెళ్లి ఖాయం చేశాడు. ఆయనకు పట్టణంలో కొయ్యగుట్ట సమీపంలో ప్లాట్‌ఉంది. దాని విలువ ప్రస్తుత మార్కెట్‌లో రూ.20లక్షల నుంచి రూ.25లక్షల వరకు ఉంటుంది. డబ్బుల కోసం ఓ బడా వడ్డీ వ్యాపారి వద్దకు వెళ్లిన సదరు ఉద్యోగి ప్లాట్ పేపర్లు ఆయన చూపాడు. సేల్ డీడ్ చేసుకొని రూ.10లక్షలు ఇచ్చేందుకు అంగీకరించిన వ్యాపారి.. రూ.5 చొప్పున వడ్డీ చెల్లించాలన్నారు. పెళ్లి తేదీ దగ్గరపడుతుండడంతో చేసేది లేక చిరుద్యోగి రూ.5 వడ్డీకి రూ.10లక్షలు తీసుకున్నాడు.

ఇది ఒక్క చిరుద్యోగి సమస్యే కాదు. సామాన్యుల అవసరాలను ఆసరా చేసుకొని వ్యాపారులు అధిక వడ్డీకి అప్పులు ఇస్తున్నారు. బాన్సువాడ డివిజన్‌లో వడ్డీ దందాకి అడ్డూఅదుపులేకుండా పోయింది. నిత్యం రూ.కోట్లలో ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయి. ఆరు నెలలుగా రియల్ వ్యాపారం నెమ్మదించడంతో భూముల కొనుగోలు కోసం వ్యాపారులు తీసుకువచ్చిన అప్పులు గుదిబండగా మారాయి. భూములు అమ్ముడుపోక, చేసిన అప్పులు తీర్చే మార్గం లేక సిరాస్థి వ్యాపారులు వడ్డీ అప్పులను ఆశ్రయిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వడ్డీ వ్యాపారులు ఓ జట్టుగా ఏర్పడి దందా కొనసాగిస్తున్నారు. సామాన్యుల ఆర్థిక పరిస్థితి బాగుందంటే సరే.. లేదంటే వడ్డీకి అప్పులిస్తాం. భూములు, ప్లాట్లు రిజిస్ట్రేషన్లు చేస్తారా? అని అడుగుతున్నారు. అప్పుల్లో కూరుకుపోయిన వ్యాపారులు తక్షణ ఉపశమనం కోసం వడ్డీ ఎంతైనా సరే డబ్బులు తీసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు.



బీర్కూర్‌కు చెందిన వడ్డీ వ్యాపారి ఇంట్లో సోదాలు చేస్తున్న పోలీసులు (ఫైల్)

ముందస్తుగా రిజిస్ట్రేషన్

అప్పులు కోసం వచ్చేవారి భూములు, ప్లాట్లను వడ్డీ వ్యాపారులు ముందే పరిశీలించి మార్కెట్‌లో వాటి విలువ తెలుసుకుంటారు. దానిలో విలువ మొత్తంలో సగం డబ్బులను చెల్లించడానికి ఒప్పందం చేసుకుంటారు. అన్నీ కుదిరితే రూ.100కు రూ.5 వడ్డీకి అప్పు ఇవ్వడానికి సిద్ధమవుతారు. వ్యక్తి అవసరాన్ని బట్టి వడ్డీ శాతాన్ని పెంచుతుంటారు. దీంతోపాటు రిజిస్ట్రేషన్ల చార్జీలు కూడా అప్పులు తీసుకునే వారే భరించాలి. ఇలా నిత్యం పదుల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి.

బడా వ్యాపారులను వదిలేసినట్టేనా..

బాన్సువాడలో వడ్డీ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలపై పోలీసులు దాడులు చేస్తున్నారు. పదిహేను రోజుల క్రితం సుమారు 10 మంది వడ్డీ వ్యాపారుల ఇళ్లలో, ఆఫీసుల్లో దాడులు చేశారు. కానీ చిరు వడ్డీ వ్యాపారులపై కేసులు నమోదు చేశారని పలువురు అంటున్నారు. రెండు రోజుల క్రితం బాన్సువాడ, బీర్కూర్‌లో వడ్డీ వ్యాపారులపై మళ్లీ దాడులు చేశారు. ఇందులో బాన్సువాడ ముగ్గురిపై, బీర్కూర్‌లో ఒక్కరిపై కేసు నమోదు చేశారు. బడా వడ్డీ వ్యాపారులను వదిలేసి చిన్నాచితక వడ్డీ వ్యాపారులపై కేసులు నమోదు చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. బాన్సువాడ డివిజన్‌లోని ఓ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వడ్డీ వ్యాపారి ఇంట్లో దాడి చేసి ‘మామూలు’గా వదిలేశారని తెలిసింది. ఇక్కడ పెద్ద మొత్తంలో చేతులు మారినట్లు సమాచారం. ఏదీ ఏమైనా వడ్డీ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలపై దాడులు పోలీసులకు కలిసివస్తోందని పలువురు పేర్కొంటున్నారు.

ఉచితం.. పరిమితం

- 17 పాయింట్ల నుంచే ఉచిత ఇసుక తరలింపునకు అనుమతి
- ఉన్న అన్ని వాగులు, నదుల నుంచి ఇవ్వాలని ప్రజల వినతి

మోర్తాడ్: ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక తరలించుకోవడానికి పరిమిత పాయింట్ల నుంచే ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జిల్లాలో చిన్న పెద్ద వాగులు, నదుల నుంచి ఇసుకను తరలించుకోవడానికి 50కి పైగా పాయింట్‌లు ఉన్నాయి. జిల్లా భూగర్భ ఖనిజాల శాఖ మాత్రం 17 పాయింట్లను గుర్తించి వాటి ద్వారానే ఇసుకను ఉచితంగా తరలించుకోవచ్చు అని వెల్లడించింది. ఇంటి నిర్మాణం కోసం ఇసుకను తరలించుకోవాలంటే ఒక్కో ట్రాక్టర్ లోడ్‌కు రూ.900 సీనరేజ్ చార్జీలుగా చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వ పనుల కోసం రూ.600 చొప్పున చెల్లించాలి. ఉచితంగా ఇసుకను తవ్వుకోవడానికి ప్రభుత్వం ఆమోదం తెలుపగా రూ.900 సీనరేజ్‌ను చెల్లించాల్సిన అవసరం లేదు. భూగర్భ ఖనిజాల శాఖ గుర్తించిన 17 పాయింట్ల నుంచి ఇసుకను జిల్లాలో ఎక్కడికైనా తరలించుకోవడానికి అనుమతి ఇవ్వనున్నారు. మొదట ఇసుకను రవాణా చేసే ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఇంటి నిర్మాణానికి అవసరమైన ట్రిప్పులకు పంచాయతీ కార్యదర్శులు అనుమతి ఇస్తే ఎలాంటి చార్జీలు చెల్లించుకోకుండానే ఇసుక తరలించొచ్చు.

జిల్లాలో గోదావరి నదితో పాటు మంజీర ప్రవహిస్తుంది. పెద్దవాగు, కప్పలవాగుతో పాటు రాళ్ల వాగు, ఇతర చిన్న చిన్న వాగులు, ఒర్రెలు ఉన్నాయి. అన్ని చోట్ల ఇసుక భారీగానే లభిస్తుంది. భూగర్భ ఖనిజాల శాఖ గుర్తించిన ఇసుక పాయింట్లలో మంజీరా, గోదావరి నదులు లేవు. పెద్దవాగు, కప్పలవాగు, పసుపు వాగు, పూలాంగ్ వాగులు మాత్రమే ఉన్నాయి. పసుపు, పూలాంగ్ వాగు పాయింట్లు రెండే ఉండగా మిగతావి అన్ని పెద్దవాగు, కప్పలవాగు రీచ్‌లు ఉన్నాయి. భూగర్భ ఖనిజాల శాఖ గుర్తించని పాయింట్ల నుంచి రాత్రి పూట రహస్యంగా ఇసుక తరలుతుంది. నిర్మల్, జగిత్యాల, హైదరాబాద్ ప్రాంతాలకు ఇసుకను కొందరు వ్యాపారులు జోరుగానే తరలిస్తున్నారు. ప్రభుత్వం గుర్తించిన పాయింట్ల నుంచి ఇసుక తరలించాలంటే రవాణా చార్జీలు ఎక్కువ అవుతాయని ప్రజలు అంటున్నారు. అందుబాటులో ఉన్న వాగులు, నదుల నుంచి ఇంటి అవసరాలకు ఇసుకను తరలించుకోవడానికి అనుమతి ఇస్తే ఎంతో మేలు జరుగుతుందని చెబుతున్నారు.



సుంకెట్ పెద్దవాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

చార్జీలు ఎక్కువ అవుతాయి



ఇంటి నిర్మాణానికి ఉచితంగా ఇసుకను తరలించుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వడం ఎంతో సంతోషం. నిర్ణీత పాయింట్ల నుంచి కాకుండా అందుబాటులో ఉన్న నదులు, వాగులు, ఒర్రెల నుంచి ఇసుక తరలించేలా వెసులు బాటు కల్పించాలి. దూర ప్రాంతాల నుంచి ఇసుక తరలిస్తే రవాణా చార్జీలు తడిసి మోపెడు అవుతాయి.

– సోమ పెద్ద రాజారెడ్డి, మాజీ సర్పంచ్, గుమ్మిర్యాల్

బాల్యవివాహం అడ్డగింత

రెంజల్(బోధన్): మండలంలోని కూనేపల్లికి చెందిన 15ఏళ్ల బాలికకు వివాహం చేస్తున్నారన్న సమాచారం మేరకు బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి పెళ్లిని అడ్డుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కూనేపల్లికి చెందిన బాలికకు మహారాష్ట్రలోని ధర్మాబాద్ ప్రాంతానికి చెందిన 24 ఏళ్ల కృష్ణ అనే యువకుడితో పెళ్లి నిశ్చయమైంది. రెండు కుటుంబాలు పెళ్లి ఏర్పాట్లలో ఉండగా.. డయల్ 100, 1098 నంబర్లకు సమాచారం అందింది. ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ ప్రమీలారాణి, అధికారులు జమురు, ముజాహిద్‌తోపాటు పోలీసులు మంగళవారం గ్రామానికి చేరుకుని బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహం చేస్తే చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ 2006 ప్రకారం శిక్షార్హులవుతారని హెచ్చరించగా, వివాహం నిలిపి వేస్తామని తల్లిదండ్రులు అంగీకరించారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణ, గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విరగకాసిన మామిడి



బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి శివారులోని మామిడిచెట్టుకు కాయలు విరగకాశాయి. చంద్రశేఖర్‌కు చెందిన పంట భూమిలో ఉన్న మామిడి చెట్టు ఒక్కో గుచ్చుకు 20కిపైగా మామిడికాయలు ఉండడంతో అటుగా వెళ్తున్నవారు ఆసక్తిగా తిలకిస్తున్నారు. చెట్టుకు ఈస్థాయిలో కాయలు కాయడం ఇదే తొలిసారి అని రైతు చంద్రశేఖర్ తెలిపాడు.

12 స్థానాల్లో విజయం ఖాయం

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ 12 స్థానాల్లో విజయం సాధించడం ఖాయమని, ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డిని శ్రీరాముడే కాపాడాలని ఎంపీ అర్వింద్ అన్నారు. నగరంలోని 35వ డివిజన్‌లో పరిధిలోగల 116వ పోలింగ్ బూత్‌లో మంగళవారం గడపగడపకూ బీజేపీ కార్యక్రమాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణతో కలిసి ఎంపీ ప్రారంభించారు. ఇంటింటికీ తిరుగుతూ బీజేపీకి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. కరపత్రాలు పంపిణీ చేసి, ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా అర్వింద్ మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ 400కుపైగా స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని, నిజామాబాద్‌లో గతంతోపోలిస్తే భారీ మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆగస్టులో రుణమాఫీ, డిసెంబర్ 2025లో చక్కెర పరిశ్రమల పునరుద్ధరణ, వందరోజుల్లో గ్యారెంటీల అమలు అంటూ సీఎం రేవంత్‌రెడ్డి హామీలిస్తున్నారని, అప్పటివరకు ఆయన ఉంటారో.. లేదో తెలియదని ఎద్దేవా చేశారు. రోజురోజుకూ బీజేపీ బలం పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్పొరేటర్లు న్యాలం రాజు, ఎర్రం సుధీర్, పంచరెడ్డి ప్రవళిక, మాస్టర్ శంకర్, నిచ్చెంగ్ కృష్ణ, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



ఎంపీ అర్వింద్‌కు తిలకం దిద్దుతున్న మహిళ

పేకాటస్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రద్ధానంద్ గంజ్ ప్రాంతంలో పేకాటస్థావరంపై దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.1800 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామని, మార్నింగ్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

న్యూసెన్స్ కేసులో జైలుశిక్ష..

నగరంలోని మూడోటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో న్యూసెన్స్ చేసిన ఇద్దరితోపాటు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలో పట్టుబడిన ఒకరిని మార్నింగ్ కోర్టులో హాజరుపరిచామని ఎస్సై తెలిపారు. న్యాయమూర్తి ముగ్గురికి రెండు రోజుల జైలుశిక్ష విధించారన్నారు.

ఓవర్‌లోడ్ వాహనాల పట్టివేత

వేల్పూర్: మండల కేంద్రం మీదుగా ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న నల్లమట్టి టిప్పర్లను ఆర్మూర్ ఆర్టీవో వివేకానందరెడ్డి మంగళవారం పట్టుకొని కేసులు నమోదు చేశారు. వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకుండా, ట్యాక్స్ చెల్లించకుండా, పర్మిట్ ముగిసినప్పటికీ నడుపుతున్నారని గుర్తించారు. వాహనాలను వేల్పూర్ పోలీస్‌స్టేషన్‌కు, ఆర్మూర్ బస్ డిపోకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతి మేరకు లోడ్‌తో వెళ్లాలని, మట్టిపెల్లలు రోడ్డుపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేల్పూర్ – భీమ్‌గల్ మధ్య ద్విచక్రవాహనదారులకు హెల్మెట్‌ధారణ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఆయన వెంట హోంగార్డులు దశరథ్, మనోజ్ ఉన్నారు.

క్రైం కార్నర్

మద్యం మత్తులో కిందపడి మృతి

ఆర్మూర్‌టౌన్: మద్యం మత్తులో కిందపడి మహారాష్ట్రకు చెందిన మారుతి(32) అనే వ్యక్తి మృతి చెందాడు. మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లిలో ఉన్న ప్రభు మెకానిక్ గ్యారెజ్‌లో ఈ ఘటన చోసుకుంది. ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక ప్రభు గ్యారెజ్‌లో పనిచేస్తూ అక్కడే ఉండే మారుతి రోజులాగే యజమాని నాగబాబు ఇంటి నుంచి సోమవారం రాత్రి 9గంటలకు భోజనం తెచ్చుకున్నాడు. మంగళవారం ఉదయం గ్యారేజీలో కిందపడిఉన్న మారుతిని లేపేందుకు డ్రైవర్లు ప్రయత్నించగా.. అతడు లేవకపోవడంతో యజమానికి సమాచారం అందించారు. ఆయన గ్యారేజీకి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు మారుతి మృతదేహాన్ని పరిశీలించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

చేపల వేటకు వెళ్లిన యువకుడు..



ఇందల్వాయి: మండల కేంద్రానికి చెందిన మైస శ్రీకాంత్(37) ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. శ్రీకాంత్ మంగళవారం గ్రామశివారులోని పెద్దచెరువు కింద ఉన్న పెద్దకచ్చు కాలువలో చేపలుపట్టేందుకు వెళ్లాడు. చేపలను వేటాడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాళ్లకు వల చుట్టుకోవడంతో నీటమునిగి మృతి చెందాడు. మృతుడి అన్నయ్య మైస శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడు..



రాజంపేట: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పట్టణ మాజీ అధ్యక్షుడు రంగ గంగాధర్‌గౌడ్ మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం ఉదయం గంగాధర్‌గౌడ్‌కు గుండెపోటురాగా కుటుంబ సభ్యులు కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సోదరుడు, సీనియర్ నాయకుడు నయీం.. షబ్బీర్ అలీ ఫౌండేషన్ తరపున బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు యాదవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు బెస్త చంద్రం, నాయకులు తదితరులు గంగాధర్‌గౌడ్ మృతికి సంతాపం తెలిపారు.

పరిస్థితి విషమించి ‘ఉపాధి’ కూలీ..



నవీపేట: ఉపాధి హామీ పనులకు వెళ్లి గుండెపోటుకు గురైన ఉపాధిహామీ కూలీ ర్యాగల్ల లావణ్య అలియాస్ లక్ష్మీనర్సమ్మ(42) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. సోమవారం ఉదయం నవీపేట శివారులోని చెరువులో పూడికతీత పనులకు వెళ్లిన లావణ్య వాంతులు చేసుకుని గుండెపోటుకు గురైంది. ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కంజర్‌లో చైన్‌స్నాచింగ్



మోపాల్(నిజామాబాద్‌రూరల్): ధాన్యం ఆరబోస్తున్న మహిళ మెడలో నుంచి దుండగులు బంగారు గొలుసు లాక్కెళ్లారు. ఈ ఘటన మండలంలోని కంజర్ శివారులో మంగళవారం చేసుకుందని ఎస్సై గంగాధర్ తెలిపారు. అరికెల లక్ష్మి కంజర్ – మోపాల్ రోడ్డుపై వడ్లు ఆరబోస్తుండగా, ఎరుపు రంగు స్కూటీపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమెను మాటల్లో పెట్టారు. చుట్టుపక్కల ఎవరూలేని సమయంలో లక్ష్మి మెడలోని చైన్‌ను లాక్కెళ్లిపోయారు. నిందితుల ఆనవాళ్లను పోలీసులు సీసీ పుటేజీలో గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- నిశ్చితార్థం అయిన మరుసటిరోజు..



ప్రభాకర్(ఫైల్)

నిజామాబాద్‌రూరల్: నిశ్చితార్థం జరిగిన మరుసటి రోజే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మండలంలోని తిర్మన్‌పల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రూరల్ పోలీస్‌స్టేషన్ ట్రెయినీ ఎస్‌హెచ్‌వో, ట్రెయినీ ఐపీఎస్ చైతన్యరెడ్డి, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తిర్మన్‌పల్లికి చెందిన దిలారి ప్రభాకర్(33) హైదరాబాద్‌లోని ఓ మెడికల్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఇటీవల ఎల్లారెడ్డిపేట్‌కు చెందిన అమ్మాయితో పెళ్లి కుదరగా, సోమవారం ఎంగేజ్‌మెంట్ అయ్యింది. వారంరోజులు సెలవుపై వచ్చిన ప్రభాకర్ గ్రామంలోనే ఉన్నాడు. మంగళవారం ఉదయం స్నేహితులు దిలారి రవి, జె.రాజుతో కలిసి ప్రభాకర్ బైక్‌పై గ్రామశివారు ప్రాంతానికి మల విసర్జనకు వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో జన్నేపల్లి – నిజామాబాద్ రోడ్డుపై బియ్యం లోడ్‌తో అతివేగంగా దూసుకువచ్చిన ఐచర్ వ్యాన్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందగా, రవి, రాజుకు స్వల్పగాయాలయ్యాయి. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. రోడ్లపై ధాన్యం ఆరబోస్తుండడంతో ప్రమాదాలు జరగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు.



ఘటనాస్థలం వద్ద రోదిస్తున్న బంధువులు

క్యాసంపల్లి వద్ద..

కామారెడ్డి క్రైం: కామారెడ్డికి సమీపంలోని క్యాసంపల్లి వద్ద సిరిసిల్లా రోడ్డుపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పాల్వంచ మండలం భవానీపేట తండాకు చెందిన లావుడ్యా రమేశ్ (35) కామారెడ్డిలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రాత్రి 9 గంటలకు బైక్‌పై పాల్వంచకు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన టాటాఏస్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రమేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొని..



శ్రీకాంత్ (ఫైల్)

కామారెడ్డి క్రైం: బైక్‌ను ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొట్టిన ఘటనలో రాజంపేట మండలం తలమడ్లకు చెందిన మంచన పల్లి శ్రీకాంత్(22) అనే యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కామారెడ్డిలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో మార్కెటింగ్ ఏజెంట్‌గా పని చేస్తున్న శ్రీకాంత్ మంగళవారం ఉదయం అమ్మమ్మ సాయవ్వ, సోదరి సింధూజతో కలిసి బైక్‌పై కామారెడ్డికి వస్తున్నాడు. ఈ క్రమంలో హెచ్‌పీ హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద అతివేగం, అజాగ్రత్తగా వచ్చిన ఓ స్కూల్ బస్సు యూటర్న్ తీసుకుంటూ బైక్‌ను ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ముగ్గురిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. శ్రీకాంత్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించినప్పటికీ అక్కడికి చేరుకునేసరికి మృతి చెందాడు. మృతుడి తండ్రి నాగభూషణం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

డ్రైవర్‌కు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష

కామారెడ్డి క్రైం: అజాగ్రత్తగా వాహనాన్ని నడిపి ఆరుగురి మృతికి కారణమైన డ్రైవర్‌కు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కామారెడ్డి కోర్టు తీర్పు వెలువరించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. 2016 అక్టోబర్ 1న పిట్లం మండలం కారేగాం గ్రామ సమీపంలోని పిల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో సంగారెడ్డి జిల్లా తడ్కల్‌కు చెందిన డ్రైవర్ ఫకీర్ ఇస్మాయిల్ కారును నడిపాడు. వరద ఉధృతిలో కారు కొట్టుకుపోగా, ఆరుగురు మృతి చెందారు. ఇస్మాయిల్ ప్రాణాలతో బయటపడ్డాడు. ఆరుగురి మృతికి కారణమైన ఇస్మాయిల్‌పై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అప్పటినుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. పూర్వాపరాలను పరిశీలించిన కామారెడ్డి మొదటి అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్ నిందితుడికి ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు రమణారెడ్డి, సత్యనారాయణ, ఎస్సై నీరేశ్‌ను ఎస్పీ సింధుశర్మ అభినందించారు.

మేనత్త మందలించిందని ఆత్మహత్య



శ్రీకాంత్(ఫైల్)

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మేనత్త మందలించిందని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని దేమికలాన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఏఎస్సై సంజీవులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కన్‌కల్ గ్రామానికి చెందిన కాడి శ్రీకాంత్(23)కు తల్లిదండ్రులు లేకపోవడంతో చిన్నతనం నుంచి దేమికలాన్‌లోని మేనత్త దగ్గర ఉంటూ వ్యవసాయం, వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ప్రతిరోజూ మద్యం సేవిస్తున్న శ్రీకాంత్ ఇంటికి రాత్రి 11.30గంటల వరకు రాకపోవడంతో మేనత్త పలుమార్లు మందిలించింది. ఈక్రమంలో సోమవారం ఉదయం ఇంటినుంచి వెళ్లిన శ్రీకాంత్ రాత్రయినా తిరిగిరాలేదు. మంగళవారం ఉదయం అతడి ఆచూకీ కోసం వెతుకుతుండగా గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. మృతుడి బంధువు కాడి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి..

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలోని ఫకీరాబాద్ – మిట్టాపూర్ మధ్య గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయిరెడ్డి మంగళవారం తెలిపారు. మృతుడికి సుమారు 55 ఏళ్ల వయస్సు ఉంటుందని, తెలుపురంగు షర్ట్, లుంగీ ధరించి ఉన్నాడన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 87126 58591, 98666 37607 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

ప్రైవేట్ పాఠశాలకు నోటీసులు

నిజామాబాద్ అర్బన్: ఫీజు చెల్లించలేదనే కారణంతో ఇద్దరు విద్యార్థులను పరీక్షకు అనుమతించని నగరంలోని అక్రిడ్జ్ పాఠశాలకు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ మంగళవారం నోటీసులు జారీ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవోకు ఫిర్యాదు చేయగా, దీనిపై ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. ఈ ఘటనపై స్పందించిన డీఈవో సదరు పాఠశాలకు నోటీసులు జారీ చేశారు.

ఒకరి అదృశ్యం



కామారెడ్డి క్రైం: కామారెడ్డి లోని కల్కినగర్ కాలనీకి చెందిన కందుకూరి కృష్ణమూర్తి అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు మంగళవారం తెలిపారు. కృష్ణమూర్తి ఐసీడీఎస్‌లో అటెండర్‌గా పని చేస్తున్నాడు. ఆర్థిక సంవత్సరం ముగింపు, ఎన్నికలకు సంబంధించిన పని మీద సిద్దిపేట కలెక్టరేట్‌కు వెళ్తున్నానని చెప్పి ఫిబ్రవరి 20న ఇంటి నుండి బయటకు వెళ్లాడు. ఆ తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా కలువలేదు. మార్చి 8న భార్య వరలక్ష్మికి ఫోన్ చేసిన కృష్ణమూర్తి.. తాను ఎక్కడ ఉన్నది చెప్పకుండానే కట్ చేశాడు. ఆ తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.